నేడు బల్దియా కోఆప్షన్ సమావేశం

● అధికార, విపక్షాల ఎత్తులతో వేడెక్కిన రాజకీయం

న్యూస్‌టుడే, ఆదిలాబాద్ అర్బన్

బల్దియా కోఆప్షన్ సభ్యుల ఎంపిక కోసం సోమవారం నిర్వహించ తలపెట్టిన సమావేశంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించే సమావేశానికి అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఇది వరకే సభ్యులకు నేరుగా కలిసి, రిజిస్టర్ పోస్టులో అజెండా ప్రతులను అందజేశారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు నడుమ సమావేశం నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నారు.

26 మంది సభ్యుల మద్దతు అవసరం

నాలుగు కోఆప్షన్ పదవులకు దక్కించుకునేందుకు అధికార, విపక్షాలు ఎత్తులకు పైఎత్తులు వేస్తుండటం రాజకీయంగా వేడి పుట్టిస్తోంది. మొత్తం 51 మంది సభ్యులున్న కౌన్సిల్‌లో కోఆప్షన్ పదవులను చేజిక్కించుకోవాలంటే 26 మంది సభ్యుల మద్దతు అవసరం. అందుకు సరిపడా సంఖ్యా బలం ఉందన్న ధీమాతో ఈసారి ఎలాగైనా సమావేశం నిర్వహించాలన్న పట్టుదలతో భాజపా ఉంది. కూటమిలోని కాంగ్రెస్, భారాస, ఎంఐఎం పార్టీలు స్వతంత్ర సభ్యులకు గాలం వేసి మెజారిటీ కూడగట్టుకునేందుకు ప్రయత్నాలు చేస్తుండటం ఆసక్తి రేపుతోంది. మరోవైపు పదవులను ఎట్టి పరిస్థితుల్లోనూ చేజారనీయవద్దనే ఉద్దేశంతో కూటమి నాయకులు వ్యూహరచన చేస్తున్నారు. తమకు మెజారిటీ ఉంటేనే సభ సజావుగా నిర్వహించేలా లేకపోతే మరోసారి ఎలాగైనా వాయిదా వేయించాలనే ప్రయత్నంలో ఉంది. ఇరు పక్షాల్లో స్వతంత్ర సభ్యులు, పార్టీలో అసంతృప్తిగా ఉన్న కౌన్సిలర్ల మద్దతు కోసం పదవులు ఆశిస్తున్న అభ్యర్థులు గాలం వేస్తుండటంతో రూ. లక్షలు చేతులు మారుతున్నాయనే ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో సమావేశం జరుగుతుందా? వాయిదా పడుతుందా? అధికార, విపక్షాల్లో ఎవరు నెగ్గుతారోననే ఉత్కంఠ నెలకొంది.

ఈనాడు ఆదిలాబాద్

బడి దశలోనే.. వ్యక్తిత్వ వికాస పాఠాలు

● తొమ్మిదో తరగతి విద్యార్థులకు ఆన్‌లైన్ బోధన

కలెక్టరేట్, న్యూస్‌టుడే

సర్కారు బడుల్లో చదువుతున్న విద్యార్థులు పోటీ ప్రపంచంలో రాణించేలా చిన్ననాటి నుంచే భవిష్యత్తు లక్ష్యాలపై అవగాహన కల్పించేందుకు జిల్లా కలెక్టర్ రాజర్షిషా త్వరలో మరో కార్యక్రమానికి శ్రీకారం చుట్టబోతున్నారు. ఉపాధ్యాయ దినోత్సవమైన సెప్టెంబరు అయిదో తేదీని ఇందుకు ముహూర్తంగా నిర్ణయించారు. జిల్లాలోని తొమ్మిదో తరగతి విద్యార్థులే లక్ష్యంగా వ్యక్తిత్వ వికాసం(పర్సనాలిటీ డెవలప్‌మెంట్), కెరియర్ గైడెన్స్‌పై ఉచితంగా ఆన్‌లైన్ తరగతులు నిర్వహించేలా 'ఏ స్క్వేర్ ఫౌండేషన్'తో ఒప్పందం కుదుర్చుకున్నారు. జిల్లాలోని 109 పాఠశాలల్లోని సుమారు 6,500 మంది విద్యార్థులకు ఈ కార్యక్రమంతో లబ్ధి చేకూరనుంది.

- గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ బడి పిల్లలు కెరియర్ అవకాశాలపై సరైన సమాచారం అందక ప్రతిభకు తగ్గ రంగాలను ఎంచుకోలేకపోతున్నారు. వారి భవిష్యత్తుకు బాట వేసేలా చదువుతో ఎలాంటి ప్రయోజనాలు ఉన్నాయి? ఏ నైపుణ్యాలు పెంపొందించుకుంటే రాణించవచ్చు? వంటి అంశాలపై నిపుణులతో పాఠాలు చెప్పించనున్నారు.
- గతంలో జిల్లాకు వచ్చిన ఫౌండేషన్ ఎండీ శ్రీలక్ష్మితో సమావేశమైన కలెక్టర్ ఇక్కడి విద్యార్థుల స్థితిగతుల గురించి ముందస్తుగా వివరించారు. అందుకు తగ్గట్లు వారిలో చైతన్యం కలిగించేలా సిలబస్ తయారు చేయాలని కోరారు.
- వారంలో రెండు రోజులు గంటపాటు 100 తరగతులు జరిగేలా కార్యక్రమాన్ని రూపొందించారు. కేవలం ఉద్యోగ, ఉపాధి అవకాశాలపైనే కాకుండా విద్యార్థుల్లో కమ్యూనికేషన్ నైపుణ్యాలు, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు, సమయపాలన, క్రమశిక్షణ, సమస్య పరిష్కార మార్గాలను చూపేలా దిశానిర్దేశం చేయనున్నారు.
- భవిష్యత్తుకు తొలిమెట్టుగా భావించే పదో తరగతిలో అడుగుపెట్టేలోపే ఓ అవగాహన కలిగేలా తొమ్మిదో తరగతి విద్యార్థులను ఎంపిక చేసి బడి దశలోనే ఉజ్వల భవితకు బలమైన పునాది పడుతుందనే ఉద్దేశంతో కలెక్టర్ నూతన కార్యక్రమాన్ని అమలు చేయనున్నారు.
- సెప్టెంబరు అయిదో తేదీన కార్యక్రమ ఆరంభంలో విద్యార్థులకు ముందస్తుగా వర్క్‌బుక్‌లను అందిస్తున్నట్లు ఏఎంఓ లక్ష్మణ్ తెలిపారు.



ఏ స్క్వేర్ ఫౌండేషన్ ఎండీ శ్రీలక్ష్మితో సమాలోచనలు చేస్తున్న కలెక్టర్ రాజర్షిషా, డీఈఓ మాధవి



కొత్తగా వచ్చిన బూట్లను చూపిస్తున్న జైనథ్ మండలం దీపాయిగూడ ప్రాథమిక పాఠశాల బాలికలు

'ఈనాడు' కథనంతో.. 31,130 మంది పిల్లలకు లబ్ధి

కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు తగిన సైజులో బూట్ల పంపిణీ ప్రక్రియ మొదలైంది. 'ఈనాడు'లో ఈ నెల 20వ తేదీన 'బూట్ల పంపిణీ.. గందరగోళం' శీర్షికన విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై కథనం ప్రచురితమైంది. ప్రధానంగా ప్రాథమిక పాఠశాలలకు అందరికీ ఒకేరకం సైజు బూట్లు రావడంతో వాటిని ఎవరికి ఇవ్వాలో తెలియక హెచ్ఎంలలో అయోమయం నెలకొంది. ఈ నేపథ్యంలో 'ఈనాడు' కథనం అధికారుల్లో కదలిక తీసుకొచ్చింది. కలెక్టర్ రాజర్షిషా ఆదేశాలతో విద్యాశాఖ సెక్టోరల్ అధికారి ఉష్కం తిరుపతి రాష్ట్రస్థాయి అధికారులతో మాట్లాడి విద్యార్థులకు సరిపడా సైజుల బూట్లు అందేలా చర్యలు తీసుకున్నారు. ఫలితంగా వారం రోజులుగా నర్సరీ, ఎల్‌కేజీ ఒక రకం, యూకేజీ- ఒకటో తరగతి మరో రకం, రెండు, మూడు, నాలుగు, అయిదు తరగతులకు వేర్వేరు రకం సైజులు పంపిణీ చేస్తున్నారు. ఆ బూట్లతో సాక్సులు అందుకున్న విద్యార్థులు వాటిని తొడిగి సంబరపడుతున్నారు. ఈనాడు చొరవతో జిలా వ్యాప్తంగా 457 పాఠశాలల్లోని 31,130 మంది పిల్లలకు తగిన సైజులో బూట్లు, సాక్సులు అందాయని ఆయా పాఠశాలల హెచ్ఎంలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

యోగాతో ఆరోగ్యం.. శిక్షణతో ఆనందం

న్యూస్‌టుడే, మందమర్రి పట్టణం: వ్యాపారంలో రాణిస్తూ 30 మందికి ఉపాధి కల్పిస్తూ.. నిత్యం పనులతో బిజీగా ఉంటూ.. సమాజం కోసం ఏదైనా చేయాలని తపనతో 61 ఏళ్ల వయసులో విద్యార్థిగా మారి యోగాలో మాస్టర్ డిగ్రీ పూర్తి చేశారు కొంపెల్లి రమేశ్. అనారోగ్య సమస్యలతో బాధపడుతూ.. మానసికంగా ఇబ్బందులు పడే వారికి తన యోగా శిక్షణతో ఉపశమనం కల్పిస్తూ మంచి పేరు సంపాదించుకున్న రమేశ్‌పై ప్రత్యేక కథనం.

61 ఏళ్ల వయసులో మాస్టర్ డిగ్రీ

కరోనా సమయంలో ఆసక్తి..

మందమర్రి పాత బస్టాండ్‌కు చెందిన కొంపెల్లి రమేశ్ పెట్రోల్ బంక్‌ను నిర్వహిస్తూ జీవనం గడుపుతున్నారు. కరోనా సమయంలో యోగాపై ఆసక్తి పెంచుకున్నారు. సామాజిక మాధ్యమం ద్వారా యోగా సాధన చేసి యోగా పోటీల్లో పాల్గొని బహుమతులు సైతం పొందారు.

అయిదేళ్లుగా..

యోగా సాధనలో లోతుగా అధ్యయనం చేయడం ప్రారంభించి ఇన్నర్‌గ్రేడ్, మాస్టర్(ప్రైవేట్), పీజీ డిప్లొమో, బెంగళూరులోని ఎస్ వ్యాస యూనివర్సిటీలో మాస్టర్ డిగ్రీ పూర్తి చేశారు. అయిదేళ్లుగా సమయం కేటాయిస్తూ యోగా శిక్షణ ఇస్తున్నారు.

ఉచిత శిబిరం..

అనారోగ్యానికి గురైన 60 మందికి పైగా విశ్రాంత సింగరేణి, ప్రభుత్వ ఉద్యోగులతో పాటు వృద్ధులకు ఉచిత యోగా శిక్షణ ఇవ్వడం మూడు నెలల కిందట ప్రారంభించారు. ఉదయం, సాయంత్రం నాలుగు గంటలపాటు వారికి యోగా శిక్షణ ఇస్తున్నారు. అనారోగ్యం బారిన పడిన వారు సైతం యోగా సాధనతో ఉపశమనం పొంది ఆరోగ్యంగా జీవనం సాగిస్తున్నారు. తన విద్యను ఉచితంగా నేర్పించి పది మంది యోగా టీచర్లను సిద్ధం చేసి ఔదార్యం చాటుకున్నారు.


మందమర్రిలో విశ్రాంత ఉద్యోగులకు శిక్షణ ఇస్తున్న రమేశ్

వంద మంది టీచర్లను సిద్ధం చేయడమే లక్ష్యం..

ఆరేళ్లపాటు నేర్చుకున్న యోగాను ప్రతి ఒక్కరికి నేర్పించేందుకు ఉచిత శిక్షణ ఇస్తున్నాను. వంద మందికి పైగా యోగా శిక్షణ ఇచ్చి టీచర్లుగా తీర్చిదిద్ది వారితో ఉచిత శిక్షణ అందించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నాను.

- కొంపెల్లి రమేశ్, మందమర్రి

అడుగు దూరంలో జూడో క్రీడాకారులు

● అంతర్జాతీయ ఎంపిక ట్రయల్స్‌కు క్రీడా పాఠశాల విద్యార్థులు


తరుణ్ | హర్షవర్ధన్ | ఝాన్సీ | సహస్ర | రామచరణ్

న్యూస్‌టుడే, ఆదిలాబాద్ క్రీడావిభాగం: జిల్లా కేంద్రంలోని క్రీడా పాఠశాలకు చెందిన అయిదుగురు పూర్వ, ప్రస్తుత జూడో క్రీడాకారులు అరుదైన ఘనతను సాధించేందుకు అడుగు దూరంలో ఉన్నారు. అండర్-18 ఎస్‌జీఎఫ్ అంతర్జాతీయ ఎంపిక ట్రయల్స్‌కు ఎంపికయ్యారు. వారు సెప్టెంబరు 17, 18వ తేదీల్లో ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్, దుండాలోని కమల్‌విహార్ ప్రాంతాల్లో నిర్వహించే అంతర్జాతీయ ఎంపిక ట్రయల్స్‌లో పాల్గొననున్నారు. ఇందులో వీరు ప్రథమ స్థానాల్లో నిలిస్తే అంతర్జాతీయ పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో డిసెంబరు 3 నుంచి 8 వరకు బ్రెజిల్ దేశంలో జరిగే జిమ్నాసియాడ్ ఈవెంట్‌లో భారత్ తరఫున ప్రాతినిధ్యం వహించే అవకాశాన్ని దక్కించుకుంటారు.

ఎంపికైంది వీరే

ఆర్.తరుణ్ (55 కిలోల విభాగం), ఎం.హర్షవర్ధన్ (60 కిలోల విభాగం) ప్రస్తుతం వీరు ఆదిలాబాద్‌లోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. డి.ఝాన్సీ (57 కిలోలు) ఆదిలాబాద్ క్రీడా పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. జి.సహస్ర (48 కిలోలు), డి.రామచరణ్ (73 కిలోలు) వీరు హైదరాబాద్‌లోని హకీంపేట క్రీడా పాఠశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి


సతీశ్

దస్తురాబాద్, న్యూస్‌టుడే : విద్యుదాఘాతానికి గురై యువకుడు మృతిచెందిన ఘటన దస్తురాబాద్ మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. పెర్కపల్లికి చెందిన ఎంబడి సతీశ్ (27) శనివారం రాత్రి ఇంట్లో ఉన్న ఇనుప కూలర్‌ను పక్కకు జరిపే క్రమంలో విద్యుదాఘాతానికి గురై మృతి చెందారు. పోలీసులు మృతదేహాన్ని ఖానాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు మృతుడి తండ్రి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయి కుమార్ పేర్కొన్నారు.

వృద్ధుడి మృతదేహం లభ్యం


చిన్నయ్య

సోన్, న్యూస్‌టుడే : సోన్ మండలంలోని జాఫ్రాపూర్‌కు చెందిన లోలం చిన్నయ్య(75) ఇటీవల అదృశ్యమయ్యారు. ఆదివారం సోన్ మండలం మాదాపూర్ వద్ద వాగులో ఆయన మృతదేహం లభ్యమైంది. చిన్నయ్య మతిస్థిమితం సరిగా లేనికారణంగా ఈ నెల 22న ఇంట్లో నుంచి వెళ్లి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన మృతదేహం లభ్యం కావడంతో నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఏఎస్సై దేవన్న వెల్లడించారు.

పులి దాడిలో దూడ హతం

సొనాల(బోథ్), న్యూస్‌టుడే : అటవీప్రాంతంలో మేతకు వెళ్లిన లేగ దూడపై పులి దాడి చేసి హతమార్చింది. గ్రామస్థుల కథనం మేరకు.. సొనాల మండలం దేవులనాయక్‌తండా, పూల్‌సింగ్‌నాయక్‌తండా గ్రామాలకు చెందిన ఆవులను దేవులనాయక్‌తండాకు చెందిన పశువుల కాపరి రాథోడ్ రవి చింతల బోరి అటవీ ప్రాంతానికి శనివారం మేతకు తీసుకెళ్లాడు. ఆవులు మేత మేస్తుండగా పులి మందపై దాడి చేసి దూడను నోట కరుచుకుంది. పశువుల కాపరి కేకలు వేయగా వదిలి పారిపోయింది. అప్పటికే దూడ మృత్యువాత పడటంతో గ్రామస్థులు, అధికారులకు సమాచారాన్ని అందజేశారు. అటవీ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని ట్రాప్ కెమెరాలు అమర్చారు. పూల్‌సింగ్‌నాయక్‌తండాకు చెందిన ఆడె కిషోర్ అనే రైతుకు చెందిన దూడగా గుర్తించారు.

హుండీ దొంగ అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న ఎస్సై షేక్ జుబేర్

తానూరు (భైంసా), న్యూస్‌టుడే : తానూరు మండలంలోని మొగిలి గ్రామంలో చోరీకి పాల్పడిన నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఆదివారం ఠాణాలో ఎస్సై షేక్ జుబేర్ వివరాలు వెల్లడించారు. మొగిలి గ్రామంలోని మహాలక్ష్మి ఆలయంలో ఆగస్టు 27న దొంగతనం జరిగింది. దర్యాప్తు జరిపిన పోలీసులు అనుమానితుడిని అదుపులోకి తీసుకొని విచారించారు. గ్రామానికి చెందిన నిందితుడు లక్ష్మణ్ మద్యానికి అలవాటు పడ్డాడు. తాగడానికి డబ్బులు లేక అర్ధరాత్రి తరువాత ఆలయంలోని హుండీ తలుపును బలంగా లాగి అందులోని రూ.5 వేలు దొంగిలించాడు. ఈ మేరకు నేరం ఒప్పుకోవడంతో అరెస్టు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

జిల్లావాసులు.. మారథాన్‌లో మెరిశారు


హాఫ్ మారథాన్ పూర్తిచేసుకున్న జిల్లావాసులతో ఎడ్ల మహేశ్(నారాయణపేట డీఎస్పీ), తదితరులు

మంచిర్యాల క్రీడావిభాగం, న్యూస్‌టుడే : ఏటా రాష్ట్ర రాజధానిలో ప్రతిష్ఠాత్మకంగా హైదరాబాద్ రన్నర్స్ నిర్వహించే ఎన్ఎండీసీ మారథాన్‌లో ఈ ఏడాది జిల్లా నుంచి పదుల సంఖ్యలో ఔత్సాహికులు భాగస్వాములయ్యారు. మారథాన్, హాఫ్ మారథాన్, 10 కిలోమీటర్ల విభాగంలో పాల్గొని నిర్ణీత సమయంలో విజయవంతంగా పూర్తి చేసుకున్నారు. గుర్తింపు పత్రాలతో పాటు పతకాలను స్వీకరించారు. రామగుండం కమిషనరేట్ పరిధిలో ఎస్సైగా పని చేస్తున్న కిరణ్(42.195 కిలో మీటర్లు) మొదటి మారథాన్ పూర్తి చేయగా.. జిల్లాకు చెందిన భాజపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథ్‌రావు, ఆయన కూతురు అరుణిమ, ఎడ్ల మహేశ్(నారాయణపేట డీసీఆర్‌బీ డీఎస్పీ), గడిగొప్పుల సతీష్(ఆసిఫాబాద్ జిల్లా ఎస్బీ సీఐ), అనంతుల దినేష్, వుత్తూరి వేణు, గుర్రం నర్సింహారెడ్డి, జనరల్ ఆసుపత్రి అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీకర్‌రావు(సర్జరీ), స్వరూణ్‌రావు, వెంకట్, ఎడ్ల శ్రీనివాస్‌తో పాటు జిల్లాలో పని చేసిన మహేందర్‌రెడ్డి(డీఎస్పీ), ముత్త రవికుమార్(సీఐ), కటికె రవిప్రసాద్(ఎస్సై) హాఫ్ మారథన్(21.097 కిలోమీటర్లు) పూర్తి చేశారు. పది కిలోమీటర్లను ఎడ్ల శ్రీదేవి, గాజుల కృష్ణకిశోర్, గడ్డం శ్రీనివాస్(న్యాయవాది), రాజు, సత్యనారాయణగౌడ్ పూర్తి చేసి పతకాలను పొందారు.


తన కూతురు, మిత్రులతో కలిసి పాల్గొన్న భాజపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథ్‌రావు


తొలి మారథాన్ పూర్తి చేసిన ఎస్ఐ కిరణ్

సీసీఐని పునరుద్ధరించే వరకు ఉద్యమిస్తాం


దీక్షలో పాల్గొన్న పొచ్చర, దిమ్మ గ్రామస్థులు

ఎదులాపురం, న్యూస్‌టుడే : జిల్లా కేంద్రంలోని సిమెంటు పరిశ్రమను పునరుద్ధరించే వరకు ఉద్యమాలు కొనసాగిస్తామని సీసీఐ సాధన కమిటీ, భారాస నాయకులు చందాల రాజన్న, సయ్యద్ సాజిద్‌ఉద్దీన్‌లు ప్రకటించారు. పరిశ్రమను పునః ప్రారంభించాలన్న డిమాండ్‌తో సీసీఐ సాధన కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు 22వ రోజుకు చేరిన నేపథ్యంలో ఆదివారం దిమ్మ, పొచ్చర గ్రామస్థులు శిబిరానికి చేరుకొని దీక్షలు కొనసాగించారు. యూనుస్ అక్బానీ, యాసం నర్సింగరావు, ఈశ్వర్‌దాస్, కృష్ణారెడ్డి, రాంరెడ్డి, దాసరి రమేష్, శ్రీనివాస్, నారాయణరెడ్డి, నర్సయ్య, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

పొన్నారి.. కూరగాయలతో సిరి


సుంకిడి ఆదివారం సంతలో కూరగాయలు విక్రయిస్తున్న పొన్నారి రైతులు

తాంసి, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రానికి దగ్గరలోనే ఆ గ్రామం.. ఆ ఊరిలోకి అడుగుపెట్టగానే కూరగాయల తోటలే స్వాగతం పలుకుతాయి. ఊరంతా వీటిని పండిస్తుండటం విశేషం. ఏ కాలంలోనైనా నిత్య ఆదాయం ఆర్జిస్తున్నారు తాంసి మండలం పొన్నారి గ్రామ రైతులు. అయిదేళ్ల క్రితం వరకు అందరిలాగే ఈ గ్రామ రైతులు పత్తి సాగు చేసేవారు. పెట్టుబడులు పెరగడంతో పాటు కూలీల కొరత, పంట దిగుబడి తగ్గిపోవడం, మార్కెట్‌లో పంటకు సరైన మద్దతు ధర లేకపోవడంతో ఆర్థికంగా నష్టపోయారు. చాలా మంది రైతులు అప్పుల్లో కూరుకుపోయి ఆత్మహత్యలకు పాల్పడ్డారు. మరికొందరు విలువైన ఆస్తులను అమ్ముకోవాల్సి వచ్చింది. దిక్కుతోచని స్థితిలో ఉన్న పొన్నారి రైతులు వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారుల సూచనలతో స్వల్పకాలంలో చేతికొచ్చే పంటల సాగు వైపు అడుగేశారు. పొలాల్లో కొంత భాగం పత్తి, సోయా, కంది ఇతర పంటలు మిగిలిన దాంట్లో కూరగాయలు పండిస్తున్నారు. ప్రధానంగా టమాటా, గోబీ, వంకాయ, బీరకాయ, పచ్చిమిర్చి, కాకర, చిక్కుడు, బెండ, పాలకూర, మెంతికూర, కొత్తిమీర, బచ్చలికూర, గోంగూర సాగుకు ప్రాధాన్యమిస్తున్నారు. పండించిన కూరగాయలను ఆదిలాబాద్ రైతుబజార్‌కు, వివిధ గ్రామాల్లో జరిగే సంతలకు తరలించి విక్రయిస్తున్నారు. ఎక్కువ మొత్తంలో సాగు చేసిన రైతులు నాగ్‌పూర్, చంద్రాపూర్ మార్కెట్లకు తీసుకెళ్తున్నారు. చుట్టుపక్కల ఉన్న వ్యాపారాలు ఇక్కడికే నేరుగా వచ్చి కొనుగోలు చేసి తీసుకెళ్తున్నారు. వాణిజ్య పంటలను వీడి కూరగాయల సాగుతో పొన్నారి గ్రామస్థులు ఆర్థికంగా ముందుకెళ్తున్నారు. వచ్చిన ఆదాయంతో పిల్లల చదువులకు అధికంగా ఖర్చు చేస్తున్నారు. కార్పొరేట్ స్కూళ్లు, కళాశాలల్లో చేర్పించి ఉన్నత విద్యను అందిస్తున్నారు. కూరగాయల ద్వారా నిత్య ఆదాయంతో వ్యాపారాలు, ఇతర చోట అధిక వడ్డీకి అప్పులు తీసుకోవడం దాదాపుగా తగ్గిపోయిందని రైతులు అశోక్, రాంరెడ్డి, దేవిదాస్, విలాస్ చెబుతున్నారు.

● పొన్నారి గ్రామ జనాభా: 3,264 ● ఓటర్లు : 1836 ● రైతులు : 253 ● సాగు భూమి విస్తీర్ణం: 2,37

మూగవేదన విని.. ఇందిరమ్మ ఇల్లు కట్టించి


ఇందిరమ్మ ఇంటిని ప్రారంభిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

తాంసి, న్యూస్‌టుడే : వారిది నిరుపేద కుటుంబం. భర్త, ఇద్దరు పిల్లలు మూగవారు. శిథిలావస్థకు చేరిన పెంకుటిల్లులో ఉంటున్నారు. తమకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని తాంసి మండలం పొన్నారికి చెందిన కీర్తి లక్ష్మీ ఆరు నెలల క్రితం కుటుంబ సభ్యులను వెంటబెట్టుకుని కలెక్టర్ రాజర్షిషాను కలిసి విన్నవించింది. స్పందించిన కలెక్టర్ విచారణ జరిపించి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేశారు. ఇటీవల నిర్మాణం పూర్తికావడంతో కలెక్టర్‌ను కలిసి గృహప్రవేశానికి ఆహ్వానించింది. కోరిందే తడవుగా ఆదివారం కలెక్టర్ గృహ ప్రవేశానికి హాజరై ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించారు. కుటుంబ సభ్యులందరికీ సారె (బట్టలు) పెట్టి అభినందించారు. మూగవారైన లక్ష్మీ భర్త రామన్న, పిల్లలు నవీన్, నందినికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. గృహనిర్మాణ శాఖ అధికారులు రెడ్డి శంకర్, రమేష్, నసీర్, ఎంపీడీవో మోహన్‌రెడ్డి, తహసీల్దార్ గణేష్ రాథోడ్, ఆత్మ ఛైర్మన్ నారాయణ, సర్పంచి భూమన్న, ఉప సర్పంచి రాంరెడ్డి, కార్యదర్శి గంగన్న తదితరులు పాల్గొన్నారు.

బాసరలో 558 అక్షరాభ్యాసాలు


చిన్నారికి అక్షరాభ్యాసం చేయిస్తున్న వేద పండితుడు

బాసర (ముథోల్), న్యూస్‌టుడే : ఆదివారం సెలవుదినంతో పాటు శ్రావణమాసం కలిసి రావడంతో బాసర అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దీంతో అమ్మవారి బాలాలయం భక్తులతో సందడిగా మారింది. వేకువజామున పవిత్ర గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించారు. అమ్మవారి దర్శనం కోసం గంట, అక్షరాభ్యాసాల కోసం రెండు గంటల సమయం పట్టింది. అమ్మవారి ఆలయంలో 558 అక్షరాభ్యాసాలు జరిగాయి. అక్షరాభ్యాసాలు, గదులు, ప్రసాదాలు ఇతర సేవల వల్ల ఆలయానికి రూ. 6.09 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయాధికారులు తెలిపారు.

ప్రత్యేక పూజలు

బాసర (ముథోల్) : బాసర అమ్మవారిని మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, ప్రస్తుత రాజ్యసభ ఎంపీ అశోక్ శంకర్‌రావు చవాన్ దంపతులు ఆదివారం దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయాధికారులు, వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో కుంకుమపూజ, మహాహారతి తదితర పూజలను నిర్వహించారు. ఆలయం తరపున సన్మానించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. అంతకుముందు మాజీ ముఖ్యమంత్రి దంపతులు బాసరలో జరిగిన ఓ ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొన్నారు. భాజపా మండల అధ్యక్షుడు సాయినాథ్ పటేల్, సీనియర్ నాయకుడు సతీశ్వర్‌రావు, భైంసా మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఆనంద్‌రావు పటేల్ స్వాగతం పలికి సన్మానించారు. బాసర సీఐ దీపక్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.



ఫిర్యాదుల పెట్టె.. చూపాలి పరిష్కార బాట

విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు, ఇబ్బందులను నేరుగా తెలుసుకునేలా పాఠశాలల్లో, కస్తూర్బా, గురుకులాల్లో ప్రభుత్వం ఫిర్యాదుల పెట్టెలను ఏర్పాటు చేయించింది. బాలికల పట్ల ఉపాధ్యాయుల వెకిలిచేష్టలు, భోజనంలో అమలుకాని మెనూ, మరుగుదొడ్ల నిర్వహణ లోపం, పరిసరాల పరిశుభ్రతలో నిర్లక్ష్యం వంటివి స్వేచ్ఛగా తెలిపేందుకు ఈ పెట్టెలను ఏర్పాటు చేశారు. ప్రస్తుత తరుణంలో ఈ పెట్టెల సేవలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోగలిగితే వారి సమస్యల పరిష్కారానికి బాటలు పడే అవకాశముంది. - న్యూస్‌టుడే-కలెక్టరేట్


బాలుర విభాగంలో విజేతగా నిలిచిన హైదరాబాద్ జిల్లా జట్టు


అత్యాపత్య రాష్ట్ర స్థాయి జూనియర్స్ బాలికల్లో ద్వితీయ స్థానంలో నిలిచిన నిర్మల్ జిల్లా క్రీడాకారులు

ముగిసిన రాష్ట్ర స్థాయి పోటీలు

నిర్మల్ అర్బన్, న్యూస్‌టుడే : నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో అత్యాపత్య అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి జూనియర్స్ బాలబాలికల పోటీలు ఆదివారం ముగిశాయి. బాలుర విభాగంలో హైదరాబాద్ జిల్లా జట్టు విజేతగా నిలవగా, బాలికల్లో నాగర్‌కర్నూల్ జిల్లా జట్టు ప్రథమ స్థానం కైవసం చేసుకుంది. బాలురలో.. రంగారెడ్డి (ద్వితీయ), తృతీయ స్థానంలో నాగర్‌కర్నూల్, సంగారెడ్డి జిల్లాల జట్లు నిలిచాయి. బాలికల విభాగంలో.. నిర్మల్ (ద్వితీయ), తృతీయ స్థానంలో రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాలు నిలవగా.. క్రీడాకారులకు మెడల్స్, ట్రోఫీలు అందజేశారు. అతిథులుగా శేఖర్, లక్ష్మణ్, పోశెట్టి, బ్రహ్మయ్య, అసోసియేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శి వన్నెల భూమన్న, సంజీవ్ హాజరై బహుమతులు ప్రదానం చేశారు. ఎంపికైన క్రీడాకారులు అక్టోబరులో జమ్ము కశ్మీర్‌లో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో హాజరుకానున్నారని అసోసియేషన్ బాధ్యులు తెలిపారు. రాష్ట్ర పరిశీలకుడు పరమేశ్వర్, బాధ్యులు అజయ్, అమర్‌సింగ్, జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు, శిక్షకులు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గోడలే.. పాఠాలు చెబుతాయ్..



చిన్నారులను ఆకట్టుకునేలా చిత్రాలతో అలంకరించిన బాధి ప్రాథమికోన్నత పాఠశాలలోని ప్రీ ప్రైమరీ తరగతి గది

బేల, న్యూస్‌టుడే: జిల్లాలో ఈ విద్యాసంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో ప్రారంభించిన ప్రీ ప్రైమరీ తరగతులను చిన్నారులకు మరింత ఆహ్లాదకరంగా మార్చేందుకు ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో భాగంగా తరగతి గదుల గోడలపై అక్షరాలు, అంకెలు, రంగులు, పండ్లు, కూరగాయలు, పక్షులు, జంతువులు తదితర చిత్రాలతో ఆకర్షణీయంగా రూపొందించారు. చిన్నారుల తరగతి గదిలోకి అడుగుపెట్టగానే రంగురంగుల బొమ్మలు కనిపించేలా గోడలు తీర్చిదిద్దారు. పాఠ్యాంశాలకు అనుగుణంగా చిత్రాలు ఏర్పాటు చేయడంతో చూస్తూ.. ఆడుతూ.. నేర్చుకునేలా వాతావరణం ఏర్పడుతోంది. అక్షరాలు, సంఖ్యలను గుర్తించడం మొదలుకొని పండ్లు, కూరగాయలు, జంతువులు, శరీర భాగాలు వంటి అంశాలను పిల్లలు చిత్రాల ద్వారా సులభంగా తెలుసుకునే అవకాశం కలుగుతోంది.

ఆహ్లాదకర వాతావరణం

చిన్నారుల తొలి విద్యాభ్యాసంలో తరగతి గది వాతావరణం కీలక పాత్ర పోషిస్తుంది. అందుకు అనుగుణంగా గోడల పై వేసిన రంగురంగుల చిత్రాలు వారిలో ఆసక్తిని పెంచుతున్నాయి. బొమ్మలను చూపిస్తూ ఉపాధ్యాయులు పాఠశాలు బోధిస్తుండటంతో పిల్లలు ఉత్సాహంగా స్పందిస్తున్నారు. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లోని ప్రీ ప్రైమరీ తరగతి గదులు చిన్నారులను ఆకట్టుకునే రంగుల బడులుగా మార్చుతున్నారు.

వెయ్యి మాటలెందుకు.. ఒక చిత్రం చాలదా



ఇక్కడ ఒక లారీ అడవిలో నరికిన చెట్లను తీసుకొని వెళ్తోంది. మరో ట్యాంకరు ఆక్సిజన్ తీసుకొని వస్తోంది. ఆ పక్కన మనుషులు ప్రాణవాయువును పైపుల ద్వారా స్వీకరిస్తున్నారు. మనం అడవికి నష్టం కలిగిస్తే భవిష్యత్తులో మనకే కష్టమని చెప్పే సందేశాత్మక చిత్రం నిర్మల్ అటవీ క్షేత్రం పరిధిలోని 'గండి రామన్న అర్బన్ పార్క్'లో కనిపించింది. అర్థం చేసుకున్న వారికి ఇంతకన్నా వివరంగా చెప్పాల్సిన అవసరం లేదని ఆ నందన వనంలో ఈ బోర్డుకేసి చూసిన వారికి అనిపించక మానదు. - న్యూస్‌టుడే, నిర్మల్ సిటీ

22ఏ భూ దోపిడీపై హైదరాబాద్‌లో మహాదీక్ష


మాట్లాడుతున్న భాజపా శాసన సభ పక్షనేత, ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

నిర్మల్ గ్రామీణం, న్యూస్‌టుడే : రాష్ట్రంలో 22ఏ (నిషేధిత భూముల జాబితా) ముసుగులో రాష్ట్ర ప్రభుత్వం పాల్పడుతున్న అక్రమాలను నిరసిస్తూ సెప్టెంబరు 5, 6 తేదీల్లో హైదరాబాద్‌లో మహాదీక్ష చేపట్టనున్నామని.. విజయవంతం చేయాలని భాజపా శాసనసభ పక్షనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం దీక్ష సన్నద్ధతపై నిర్మల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్ అధ్యక్షతన నాయకులు, కార్యకర్తలతో సమీక్ష నిర్వహించారు. హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద జరగనున్న మహా దీక్షకు తరలిరావాలని దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో భూబదిలీలు, ఆస్తుల బదలాయింపు పేరుతో సాగుతున్న కుంభకోణాలపై, ప్రభుత్వ అవలంబిస్తున్న మొండివైఖరిని ఎండగట్టేందుకు దీక్ష చేపడుతున్నట్లు వివరించారు. నిర్మల్ నియోజకవర్గం నుంచి పెద్దసంఖ్యలో తరలిరావాలన్నారు. ప్రజలకు ఇబ్బందులపాలు చేయనున్న 22ఏ భూముల నిబంధనలు ఉపసంహరించుకునే వరకు ప్రజా ఉద్యమం కొనసాగుతుందన్నారు. సమావేశంలో నాయకులు రావుల రాంనాథ్, మేడిసెమ్మె రాజు, ఆకుల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి రవీందర్‌రెడ్డి, కరిపె విలాస్, అంకం మహేందర్, పుర కౌన్సిలర్లు, సర్పంచులు ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

కలల సౌధం.. కరెంటు తీగలే ఆటంకం

ఇచ్చోడ, న్యూస్‌టుడే:

అత్యంత వెనుకబడిన ఆదివాసీ తెగల(పీవీటీజీ) సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక పథకాల అమలు చేస్తున్నా క్షేత్రస్థాయిలో సమస్యలు వెంటాడుతున్నాయి. ఇచ్చోడ మండలంలోని దుబార్‌పేట్ గ్రామంలో పీవీటీజీ వర్గాలకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు విద్యుత్తు తీగలు అడ్డంకిగా మారాయి. స్థలాలపై నుంచి తీగలు వెళ్తుండటంతో 15 ఇళ్ల నిర్మాణాలు నిలిచిపోయాయి. అధికారులు సమస్య పరిష్కరిస్తామని చెప్పినప్పటికీ ఇప్పటివరకు చర్యలు తీసుకోకపోవడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.


కర్రల సహాయంతో తీగలను పక్కకు లాగి ఇళ్ల నిర్మాణ పనులు చేస్తున్నారిలా..

దుబార్‌పేట్‌లో పీవీటీజీ కుటుంబాలకు పీఎం జన్మన్ పథకం కింద 90 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయి. ప్రతి కుటుంబానికి సొంత ఇల్లు, సురక్షిత తాగునీరు వంటి మౌలిక వసతులు కల్పించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.


దుబార్‌పేట్‌లో ఇందిరమ్మ ఇళ్లపై నుంచి వెళ్తున్న విద్యుత్తు తీగలు

ఇళ్ల నిర్మాణం చేపట్టిన ప్రాంతంలో విద్యుత్తు తీగలు నుంచి వెళ్తుండటంతో నిర్మాణ పనులు చేపట్టేందుకు లబ్ధిదారులు భయపడుతున్నారు. 15 కుటుంబాలకు మంజూరైన ఇళ్ల నిర్మాణాలు మధ్యలోనే నిలిచిపోయాయి. కొందరు కర్రలు పెట్టి, తీగలను పక్కకు లాగి పనులు సాగిస్తున్నారు.

విద్యుత్తు తీగల సమస్య పరిష్కారానికి ఇప్పటికే నివేదికను తయారు చేసి ఉన్నతాధికారులకు పంపించామని విద్యుత్తు ఏఈ శ్రావణ్ తెలిపారు. త్వరలోనే సమస్య పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)

ఆదిలాబాద్: 91541 18155, తలమడుగు: 9989120742
బోథ్: 91548 46671, ఉట్నూరు: 94410 86640

? **తాంసి :** తాంసి నుంచి వామన్‌నగర్ మీదుగా గిరిగామ్ వరకు వెళ్లే రోడ్డు అధ్వానంగా తయారైంది. - **యశ్వంత్, అంబుగామ్**

✔ నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. - **శివరాం, ఈఈ పంచాయతీరాజ్**

విద్యుదాఘాతంతో పశువుల పాక దగ్ధం



సొనాల(బోథ్), న్యూస్‌టుడే : విద్యుదాఘాతంతో పశువుల పాక దగ్ధమైంది. స్థానికుల కథనం మేరకు.. సొనాల మండలం దేవులనాయక్ తండా పంచాయతీ పరిధిలోని ఫూల్‌సింగ్‌నాయక్‌తండాకు చెందిన రైతు జోర్‌సింగ్‌కు గ్రామ సమీపంలో పశువుల పాక ఉంది. ఆదివారం మధ్యాహ్నం విద్యుదాఘాతంతో పాకలో మంటలు చెలరేగాయి. అందులో ఉన్న ఎండు గడ్డి, వ్యవసాయ సామగ్రి, యూరియా, డీఏపీ బస్తాలు కాలి బూడిదయ్యాయి. గ్రామస్థులు మంటలను ఆర్పి వేశారు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని రైతు వాపోయాడు.

పందుల దాడిలో జొన్న పంట ధ్వంసం



బజార్‌హత్నూర్, న్యూస్‌టుడే : పందుల దాడిలో సాగులో ఉన్న జొన్న పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. బజార్‌హత్నూర్ సమీపంలో మూడెకరాల్లో సాగు చేస్తున్న జొన్నను శనివారం రాత్రి అడవి పందుల గుంపు చిందరవందర చేశాయి. పూత దశలో ఉన్న పంట దాదాపు సగం వరకు పాడైనట్లు రైతు వాపోయాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నాడు.

బజ్జీల దుకాణంలో చోరీ

ఇంద్రవెల్లి, న్యూస్‌టుడే: బజ్జీల దుకాణంలో గుర్తు తెలియని వ్యక్తి చోరీకి పాల్పడిన ఘటన ఇంద్రవెల్లి మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై సాయన్న తెలిపిన వివరాల ప్రకారం.. ఈశ్వర్‌నగర్ గ్రామంలోని ఓ వైన్స్‌లో శనివారం అర్ధరాత్రి చోరీ చేసేందుకు గుర్తు తెలియని వ్యక్తి షట్టర్ తెరవడానికి ప్రయత్నించాడు. అది రాకపోవడంతో దాని పక్కనే ఉన్న మండల కేంద్రానికి చెందిన గుట్టే సదానంద్ బజ్జీల దుకాణం తాళాలు పగలగొట్టి రూ.1000 ఎత్తుకెళ్లాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు. సామాజిక మాధ్యమాల్లో సీసీ కెమెరాలో చిక్కిన దృశ్యాలు చూపిస్తూ పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

విద్యార్థి అదృశ్యంపై కేసు

ఆదిలాబాద్ నేర విభాగం : పట్టణంలోని భాగ్యనగర్‌కు చెందిన డిగ్రీ చదువుతున్న అనురాగ్ అదృశ్యం కేసును ఆదివారం నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ నాగరాజు తెలిపారు. ఈ నెల 21న తల్లి మందలించడంతో ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయాడన్నారు.

ఆటోకు మరో ఆటో ఇంజిన్ అమర్చిన వారిపై..

ఆదిలాబాద్ నేర విభాగం : ఒక ఆటోకు మరో ఆటో ఇంజిన్ అమర్చిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ సునిల్‌కుమార్ తెలిపారు. జైనథ్‌కు చెందిన షేక్ కలీంకు చెందిన ఆటో ఇంజిన్‌ను షేక్ తౌఫీక్ ఆటోకు అనధికారికంగా అమర్చారన్నారు. వాహన తనిఖీల్లో ఆ ఆటో నంబరు ఏపీ25 ఎక్స్6152ను పరిశీలించగా ఇంజిన్ నంబరు మరొకటి ఉన్నట్లు గుర్తించామన్నారు. దీంతో ఆ ఇరువురిపై కేసు నమోదు చేసి ఆటోను స్వాధీనం చేసుకున్నామన్నారు.



ఆ చరవాణి నంబర్లు పని చేయవు

ఆదిలాబాద్ పట్టణం దస్నాపూర్ ప్రాంతంలోని పిట్టలవాడ విద్యుత్తు సబ్ స్టేషన్‌లో పలువురు వినియోగదారులు వారి నెలవారీ విద్యుత్తు బిల్లులు చెల్లిస్తుంటారు. ఉదయం పది నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు సిబ్బంది బిల్లులు తీసుకోవాల్సి ఉంటుంది. వినియోగదారుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన రెండు చరవాణుల నంబర్లకు ఫోన్ చేస్తే ప్రస్తుతం అవి వినియోగంలో లేవన్న సమాధానం వస్తోంది. - **న్యూస్‌టుడే, ఎదులాపురం**

స్తంభం పడితే ప్రమాదమే

జిల్లాకేంద్రంలోని సాత్నాల బస్టాండ్ సమీపంలో పోలీస్ పెట్రోల్ బంకు ఎదురుగా రహదారిపై ఓ విద్యుత్తు స్తంభం ప్రమాదకరంగా వేలాడుతోంది. ధ్వంసమైన స్తంభాన్ని తొలగించకుండా అలాగే వదిలేశారు. నిత్యం వాహనదారులు, బాటసారులు తిరిగే రహదారి కావడంతో ప్రమాదం జరిగే అవకాశముందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. - **న్యూస్‌టుడే, ఆదిలాబాద్ అర్బన్**





బస్సు ఎక్కుతున్న మహిళలు

బస్టాండులో రద్దీ.. తప్పని ఇబ్బంది

ఇంద్రవెల్లి, న్యూస్‌టుడే: రక్షాబంధన్ వేళ అన్నదమ్ములకు రాఖీ కట్టేందుకు పుట్టింటికి వచ్చిన అక్కాచెల్లెళ్లు తిరిగి ఇంటికి వెళ్లే క్రమంలో ఆర్టీసీ బస్సులు ఇలా ఆడపడుచులతో నిండిపోయాయి. ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని బస్టాండు వద్ద ఆదివారం బస్సు ఎక్కడానికి మహిళలు, యువతులు పోటీ పడుతుండగా.. న్యూస్‌టుడే ఈ దృశ్యాన్ని క్లిక్‌మనిపించింది.

నీట్ పీజీ పరీక్ష ప్రశాంతం

కలెక్టరేట్, న్యూస్‌టుడే : నీట్ పీజీ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. పట్టణశివారులోని నలంద డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ రాజర్షిషా సందర్శించి అక్కడి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12-30 గంటల వరకు (కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ విధానంలో) పరీక్ష జరిగింది. బయోమెట్రిక్ ప్రక్రియ దృష్ట్యా ఉదయం ఏడు గంటల నుంచి అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసి కేంద్రంలోకి అనుమతించారు. మొత్తం 100 మందికిగాను అందరూ హాజరైనట్లు నోడల్ అధికారి గణేష్‌జాదవ్, సెంటర్ ఇన్‌ఛార్జి పున్నారావు తెలిపారు. ఏఎస్పీ సురేందర్‌రావు, డీఎస్పీ జీవన్ రెడ్డి బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



ఏర్పాట్లపై ఆరా తీస్తున్న కలెక్టర్ రాజర్షి షా

'వారి మాటలను పట్టించుకోను'



పార్టీలో చేరిన కార్యకర్తలతో డీసీసీ అధ్యక్షుడు నరేష్ జాదవ్

ఆదిలాబాద్ అర్బన్, న్యూస్‌టుడే : కాంగ్రెస్ పార్టీలో 28 ఏళ్లుగా క్రమశిక్షణతో ఏఐసీసీ, టీపీసీసీ, సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకే పని చేస్తున్నానని, పార్టీ సిద్ధాంతాలు తెలియని వారు, ఆయారాం, గయారాంలు మాట్లాడిన మాటలను పట్టించుకోనని డీసీసీ అధ్యక్షుడు నరేష్ జాదవ్ అన్నారు. ఆదివారం పట్టణంలోని డీసీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నిన్న, మొన్న వచ్చిన వారికి నామినేటెడ్, పార్టీ పదవులు ఇవ్వాలా? పార్టీ కోసం కష్టపడ్డ కార్యకర్తలను ఏం చేయాలని ప్రశ్నించారు. అనంతరం ఇచ్చోడ మండలం సాత్‌నంబర్ గ్రామానికి చెందిన పలువురు భారాసను వీడి కాంగ్రెస్‌లో చేరగా కండువాలు వేసి ఆహ్వానించారు.

ఓటర్లు తొలగిపోకుండా చూడండి

ఆదిలాబాద్ అర్బన్, న్యూస్‌టుడే : ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో ఆదిలాబాద్ నియోజకవర్గంలో 85వేల మందికి నోటీసులు వచ్చే అవకాశముందని, అర్హత కలిగిన ఏ ఒక్కరూ జాబితా నుంచి తొలగిపోకుండా చూడాలని కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కంది శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో బీఎల్ఏ-2లు, సూపర్‌వైజర్లు, కోఆర్డినేటర్లు, కౌన్సిలర్లు, పోటీచేసిన అభ్యర్థులతో ఓటరు జాబితాపై సమావేశం నిర్వహించారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ బండారి అనూష, ఆత్మ కమిటీ ఛైర్మన్ గిమ్మ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కంది శ్రీనివాసరెడ్డి

చదువుతోనే అభివృద్ధి సాధ్యం

ఇంద్రవెల్లి, ఆదిలాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే : మాంగ్ కులస్థులు అభివృద్ధి చెందాలంటే అది కేవలం చదువు వల్లే సాధ్యమవుతుందని ఎంపీ గోడం నగేశ్ అన్నారు. ఆదివారం ఇంద్రవెల్లి మండలం హీరాపూర్‌లో సాహిత్య రత్న అన్నాభావు సాఠే 106వ జయంతిలో ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి మాట్లాడారు. అన్నాభావు సాఠే సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నర్సింగ్, ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు ఉద్దవ్, సర్పంచులు తుకారాం, రాజేశ్వర్ పాల్గొన్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని కస్తాల రాంకిష్టు కాలనీలో ఘనంగా జరుపుకొన్నారు.



హీరాపూర్‌లో మాట్లాడుతున్న ఎంపీ గోడం నగేశ్

స్వనిధి రుణాలు సద్వినియోగం చేసుకోవాలి

ఉట్నూరు గ్రామీణం, న్యూస్‌టుడే : కేంద్ర ప్రభుత్వం చిరు వ్యాపారులకు ఎలాంటి పూచీకత్తు లేకుండా నేరుగా బ్యాంకుల ద్వారా రూ. 50 వేలు నుంచి రూ.2 లక్షల వరకు అందిస్తున్న స్వనిధి రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని భాజపా నిర్మల్ జిల్లా అధ్యక్షుడు రితీష్ రాఠోడ్ అన్నారు. ఉట్నూరులో ఆయన నివాసంలో భాజపా జిల్లా మండల స్థానిక నాయకులతో కలిసి ఆదివారం మన్ కీ బాత్ 137వ కార్యక్రమాన్ని వీక్షించారు. జిల్లా కార్యదర్శి కొండేరి రాజేశ్వర్, మండల అధ్యక్షుడు వెంకటేష్, నాయకులు రవీందర్, శ్రీకాంత్, విజయ్, రమేష్, దేవిదాస్, రమణ తదితరులు పాల్గొన్నారు.



ఉట్నూరులో ప్రధాని మోదీ మన్ కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షిస్తున్న భాజపా నిర్మల్ జిల్లా అధ్యక్షుడు రితీష్ రాఠోడ్

'కోఆప్షన్' ఎన్నిక జరగకపోతే కోర్టుకు వెళ్తాం

కలెక్టరేట్ : ఉద్దేశపూర్వకంగా వాయిదా వేస్తూ వస్తున్న ఆదిలాబాద్ మున్సిపల్ కోఆప్షన్ సభ్యుల ఎన్నిక జరగకపోతే ఛైర్‌పర్సన్‌పై కోర్టుకు వెళ్తామని భాజపా జిల్లా ఉపాధ్యక్షుడు జోగు రవి స్పష్టం చేశారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. సాయి, రాకేష్, జీవన్, పోశన్న, హనుమాండ్లు, మనోజ్, సతీష్, శివ, భూమారెడ్డి పాల్గొన్నారు.

కలశ స్థాపన మహోత్సవం

గుడిహత్నూర్(భుక్తాపూర్) : మండలంలోని చిన్న మల్కాపూర్ గ్రామంలో ఆదివారం శ్రీహనుమాన్ మందిరంలో భక్తులు కలశ స్థాపన మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ తిరుమల్‌గౌడ్, సర్పంచి ప్రతాప్, నాయకులు పవార్ రవినాయక్, కేంద్రె శివాజీ, జాడి సుభాష్ పాల్గొన్నారు.

సంక్షిప్తం

వృద్ధుడిపై కొండెంగ దాడి

సొనాల(బోథ్): సొనాల ప్రయాణ ప్రాంగణంలో ఆదివారం మధ్యాహ్నం గ్రామానికి చెందిన ముత్తన్న అనే వృద్ధుడిపై కొండెంగ దాడి చేసింది. పది రోజుల వ్యవధిలోనే దాదాపు ఆరుగురిని గాయపర్చింది.

రేపు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

ఇచ్చోడ: ఇచ్చోడంలోని సబ్‌స్టేషన్‌లో మరమ్మతు మంగళవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సరఫరా నిలిచిపోనుందని ఏఈ శ్రావణ్ తెలిపారు.

ఆలయంలో భజనలు

సొనాల(బోథ్): సొనాల రామాలయంలో శ్రావణమాసాన్ని పురస్కరించుకొని సీతారామ భజన మండలి ఆధ్వర్యంలో రాత్రి 9 గంటల నుంచి అర్ధరాత్రి వరకు నిత్య భజనలు చేస్తున్నారు.

భవన నిర్మాణానికి వినతి

ఆదిలాబాద్ అర్బన్: తెలంగాణ దూదేకుల నూర్‌బాషా సంఘం అభ్యున్నతికి తన వంతు సహకారం ఉంటుందని కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కంది శ్రీనివాసరెడ్డి అన్నారు. సంఘం నాయకులు ఆదివారం ఆయనను కలిసి జిల్లా కేంద్రంలో సంఘం భవనం కోసం వినతిపత్రం అందించారు.

భీంపూర్ : దూదేకుల సంఘం నాయకులు మాజీమంత్రి జోగు రామన్నను కలిశారు. తమ కులస్థుల అభ్యున్నతికి, రాజకీయ అవకాశాలు కల్పించాలని కోరారు. వహీద్, అన్వర్ భాషా, రంజాన్ మహ్మద్, సూర్యరావు, షేక్ గని, అబ్దుల్ హదీ పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

ఆదిలాబాద్ గ్రామీణం : పట్టణంలోని 4వ వార్డు పరిధిలోని బంగారుగూడ శ్రీ అభయ ఆంజనేయస్వామి ఆలయ కమిటీ కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా గోపి, విశాల్, బాలాజీ, గౌరవ అధ్యక్షుడిగా పరుశురాం, ఉపాధ్యక్షులుగా స్వామి, విజయ్‌కుమార్, కార్యదర్శిగా సంజీవ్, కోశాధికారిగా క్షీర్‌సాగర్ పరుశురాం, సలహాదారుగా పెద్ద మల్లయ్యలు ఎన్నికయ్యారు.

ఆదిలాబాద్ గ్రామీణం : బొందిలి రాజ్‌పుత్ సమాజ్ యువజన విభాగం కార్యవర్గాన్ని ఆదివారం బీసీ సంఘ భవనంలో ఎన్నుకున్నారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఠాగూర్ విశాల్ సింగ్, ఠాగూర్ ఆకాశ్ సింగ్ల ఎన్నికయ్యారు.

భీంరావు విగ్రహాన్ని అధికారికంగా ఏర్పాటు చేయాలి

ఉట్నూరు గ్రామీణం: ఆదివాసీ తొలి పట్టభద్రుడు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తొలి గిరిజన శాఖ మంత్రి దివంగత కొట్నాక భీంరావు విగ్రహాన్ని ఉట్నూరులో అధికారికంగా ఏర్పాటు చేయాలని కుమురం భీం యువసేన వ్యవస్థాపకుడు పెందూర్ ప్రభాకర్ డిమాండ్ చేశారు. ఆదివారం మాజీ మంత్రి కొట్నాక భీంరావు స్వగృహంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సమ్మేళనం విజయవంతం చేయాలి

ఉట్నూరు గ్రామీణం : తెలంగాణలోని బౌద్ధులను ఏకం చేయడానికి లక్ష మంది బుద్ధిస్టులతో ఏర్పాటు చేయనున్న భారీ సభకు ప్రతీ ఒక్కరూ రావాలని భారతీయ బౌద్ధ మహాసభ ప్రధాన కార్యదర్శి రత్నజాడే ప్రజ్ఞకుమార్ అన్నారు. ఆదివారం ఉట్నూరు ఊర్వేల బుద్ధ విహార్‌లో ఏర్పాటు చేసిన బుద్ధిస్టుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో ఆయనతోపాటు భారతీయ బౌద్ధ మహా సభ జిల్లా ప్రధాన కార్యదర్శి కాంబ్లె ప్రజ్ఞశీల్, రాష్ట్ర అధ్యక్షుడు గడపలే ప్రభాకర్ మాట్లాడారు.





సత్యనారాయణ వ్రతం.. ఆధ్యాత్మిక పరిమళం

జిల్లా కేంద్రం సమీపంలోని బెల్లూరి అయ్యప్పస్వామి ఆలయంలో ఆదివారం సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు. అందులో శబరిమలకు వెళ్లి వచ్చిన 275 మంది భక్తులు వ్రతంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితులు సంతోష్ శర్మ వారికి వ్రత విశిష్టతను వివరించారు. - **న్యూస్‌టుడే, ఆదిలాబాద్ సాంస్కృతికం**

ఆరోగ్య సూచనలిచ్చి.. సైకిల్ ర్యాలీ ప్రారంభించి



జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని క్రీడా ప్రాంగణంలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. పిల్లలు, యువత ఎంతో హుషారుగా క్రీడా ప్రాంగణం నుంచి ఎన్టీఆర్ కూడలి వరకు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా యువజన క్రీడల అధికారి ఎ.దయానంద్‌రెడ్డి మాట్లాడుతూ.. రోజూ సైక్లింగ్ చేయడం ద్వారా ఆరోగ్యవంతమైన జీవితం సొంతమవుతుందన్నారు. - **న్యూస్‌టుడే, ఆదిలాబాద్ క్రీడావిభాగం**



కండువాలు కప్పి సీఐటీయూలోకి స్వాగతం పలుకుతున్న కార్యదర్శి అన్నమొల్ల కిరణ్

స్లాబుల వారీగా వేతనాలు చెల్లించడం దారుణం

ఎదులాపురం, న్యూస్‌టుడే : ఇంటిగ్రేటెడ్ స్కూల్ మేనేజ్‌మెంట్ (గ్రాంట్స్) పేరుతో విద్యార్థుల సంఖ్యను బట్టి స్కావెంజర్లకు స్లాబుల వారీగా వేతనాలు చెల్లించడం దారుణమని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ అన్నారు. సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆ సంఘంలో చేరిన స్కావెంజర్లకు సంఘం కండువాలు కప్పి ఆహ్వానించారు. సురేందర్, పొచ్చన్న, సుధాకర్, మారుతి, మోహన్, గోకుల్, సంజయ్, శేషరావు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి

నేరడిగొండ : బోథ్ నియోజకవర్గంలో కాంగ్రెస్ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలందరూ కృషి చేయాలని మండల అధ్యక్షుడు ఏలేటి రాజశేఖర్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లో డీసీసీ అధ్యక్షుడు నరేష్ జాదవ్‌పై బోథ్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఆడే గజేందర్ టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌కు ఫిర్యాదు చేయడంపై ఆదివారం నేరడిగొండలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు.

హామీల అమలుకు నిరసన

ఇచ్చోడ, న్యూస్‌టుడే : కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని ముఖరా(కె) గ్రామ రైతులు వినూత్నంగా నిరసన తెలిపారు. పొలాల్లో ఒంటికాలిపై నిలబడి గుంజీలు తీస్తూ నిరసన చేపట్టారు. 'ఆరు గ్యారంటీలు-420 హామీలు గోవిందా' అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. మాజీ సర్పంచి గాడ్గే మీనాక్షి, మాజీ ఎంపీటీసీ గాడ్గే సుభాష్‌తో పాటు రైతులు పాల్గొన్నారు.

రేపు సమన్వయ సమావేశం

ఆదిలాబాద్ నేర విభాగం : గణపతి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో సమన్వయంతో జరుపుకోవాలని డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి సూచించారు. జిల్లాలోని అన్ని గణేష్ మండపాల నిర్వాహకులు, హిందూ ఉత్సవ సమితి సభ్యులతో మంగళవారం స్థానిక తనీషా గార్డెన్‌లో ఎస్పీ అఖిల్ మహాజన్ ఆధ్వర్యంలో ఉదయం పదిన్నరకు సమన్వయ సమావేశం నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

వైభవంగా భీమన్న దేవుడి విగ్రహ ప్రతిష్ఠాపన

ఆదిలాబాద్ సాంస్కృతికం, ఆదిలాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే : జిల్లా కేంద్రంలోని గాంధీ పార్కులో ఆదివారం భీమన్న దేవుడు, పెద్దమ్మ తల్లి విగ్రహాల ప్రతిష్ఠాపన అత్యంత వైభవంగా సాగింది. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాయల్ శంకర్ హాజరయ్యారు. వేద పండితులు సంతోష్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకు ముందు బస్టాండు ఎదుట పండుగ సాయన్న విగ్రహాన్ని ఆవిష్కరించారు. ముదిరాజ్ సంఘం అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అనంతరం భీమన్న దేవుని ఆలయం వరకు ద్విచక్రవాహన ర్యాలీ నిర్వహించారు. పుర అధ్యక్షురాలు బండారి అనూష, ఏఎంసీ ఛైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, మాజీ మంత్రి జోగు రామన్న, ముదిరాజ్ సమాజ్ సంఘం బాధ్యులు పాల్గొన్నారు.



సాయన్న విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్, పుర అధ్యక్షురాలు బండారి అనూష